సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 9 । జూలై । 2025



## ఎస్‌బీఐ ఏటీఎం దగ్ధం

యానాం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎం కాలిపోయిన ఘటనలో సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించింది.

-8లో...



## రక్కసీ కోత

ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఒక్కసారిగా ఉప్పొంగుతూంటాయి. దీంతో తీరం వెంబడి భూమి మీటర్ల మేర కోతకు గురవుతోంది.

-8లో...

## కడలిలోకి 1.98 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ఉధృతి మంగళవారం స్వల్పంగా పెరిగింది. బ్యారేజీ నుంచి 1,98,710 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 6,500 కలిపి మొత్తం 13,550 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.80 అడుగులుగా నమోదైంది.

## న్యూస్‌రీల్


### శృంగేరిలో పద్య రచనా శిక్షణ శిబిరం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కర్ణాటకలోని దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠంలో జగద్గురువుల ఆదేశం మేరకు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ 'సాహిత్య శారదా' అనే శీర్షికతో పద్య రచనా శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. తెలుగు పద్య రచన నేర్చుకొనే ఆసక్తి ఉన్నవారు https://tinyurl.com/TeluguPadya వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఈ శిబిరంలో సుప్రసిద్ధ శతావధానులైన డాక్టర్ రాంభట్ల పార్వతీశ్వర శర్మ, డాక్టర్ తాతా సందీప్ శర్మ, విద్వాన్ గన్నవరం లలితాదిత్య శర్మ పాల్గొని, పద్య రచనలో మెళకువలు నేర్పిస్తారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

### సంగీత, నృత్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నగరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో వివిధ కోర్సులకు గాను 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక సంగీతం, గాత్రం, వాద్యం, నాట్యం, మృదంగం, డోలు, శాస్త్రీయ నృత్య విభాగాల్లో నాలుగేళ్ల డిప్లొమా, రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించనున్నామన్నారు. కర్ణాటక సంగీతం, నాట్యం తదితర విభాగాల్లో ప్రతిభా ప్రదర్శన ఆధారంగా ఎంపిక పరీక్ష నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేస్తామని వివరించారు. సర్టిఫికెట్ కోర్సులో చేరే విద్యార్థుల వయస్సు ఈ నెల ఒకటో తేదీ నాటికి పదేళ్లు, డిప్లొమా కోర్సులో చేరే వారికి 15 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. దరఖాస్తుకు ఈ నెల 31 తుది గడువుగా పేర్కొన్నారు. మరింత సమాచారానికి 0883–2421669 ఫోన్ నంబర్‌లో కార్యాలయ పని వేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని నాగలక్ష్మి సూచించారు.


### బూత్ లెవెల్ అధికారులకు నేటి నుంచి శిక్షణ



కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులకు బుధవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 1,581 మంది బూత్ లెవెల్ అధికారులు ఈ శిక్షణకు హాజరవుతారన్నారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో మొత్తం ఆరు బ్యాచ్‌లుగా వీరికి శిక్షణ ఇస్తామన్నారు. దీనికి బూత్ లెవెల్ అధికారులతో పాటు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, నమోదు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అనపర్తిలో 228, రాజానగరం 216, రాజమహేంద్రవరం రూరల్ 241, రాజమహేంద్రవరం అర్బన్ 176, కొవ్వూరు 205, నిడదవోలు 246, గోపాలపురంలో 269 మందికి శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ వివరించారు.

### కేంద్ర పథకాలు ప్రజలకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, వారు లబ్ధి పొందేలా చూడాలని ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ సంఘం (దిశ కమిటీ) చైర్మన్ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన దిశా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ, ఘన వ్యర్థాల నిర్వహణ, జల్‌జీవన్ మిషన్, అమృత్, ఫసల్ బీమా యోజన, పింఛన్లు, గృహ నిర్మాణం, క్షయ వ్యాధి నివారణ, పీఎం సూర్య ఘర్ పథకాలపై ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతితో కలసి అధికారులతో సమీక్షించారు. ప్రతి పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా, నమోదైన లబ్ధిదారుల సంఖ్య, పురోగతి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన వేణు, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా తదితరులు

కొవ్వూరులో రక్తదానం చేస్తున్న నేతలు తలారి వెంకట్రావు, కంఠమని రమేష్



అనపర్తి దేవీచౌక్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

# మహానేతా.. సదాస్మరామి..

- ఘనంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి
- జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు
- ఆయన సేవలను స్మరించుకున్న ప్రజలు
- కొవ్వూరులో భారీ రక్తదాన శిబిరం

### అనపర్తి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యాన వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అనపర్తి దేవీచౌక్, బాపనమ్మ గుడి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వైఎస్ జయంతి వేడుకల్లో కూడా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



వైఎస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు



రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: జనహృదయ నేతను.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ఆరోగ్యప్రదాతను ప్రజలు స్మరించుకున్నారు. ఆ సంక్షేమ సారథికి సలాం చేశారు. మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలతో ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీకే రుణాలు, రైతు రుణమాఫీ, 108, 104 వంటి అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేసిన వైఎస్సార్ పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయనే బతికి ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా విడిపోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు. పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించడం ద్వారా వారి కుటుంబాల స్థితిగతులు మార్చాలనే ఆలోచనతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టిన మహనీయుడని కొనియాడారు. అద్భుతమైన పథకాలతో వైఎస్సార్ పాలన స్వర్ణయుగంలా సాగిందని అభివర్ణించారు.

### రాజమండ్రి సిటీ

దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లోని పార్టీ సిటీ కార్యాలయంలో వైఎస్ జయంతి నిర్వహించారు. తాడితోట సెంటర్ వాంబే గృహాలు, కోటగుమ్మం సెంటర్, క్వారీ మార్కెట్ సెంటర్, దానవాయిపేట ఫణీంద్ర స్కానింగ్ సెంటర్లలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఎనిమిదో వార్డులో సత్తిరెడ్డి ఆధ్వర్యాన దుప్పట్లు పంపిణీ చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్ సీపీ అధినేత, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని భరత్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

- స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కొనియాడారు. తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైఎస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ అధ్యక్షులు మహమ్మద్ ఆరీఫ్ పాల్గొన్నారు.

### రాజమండ్రి రూరల్..

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. బొమ్మూరులో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యాన వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. రాజవోలు గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు ఆధ్వర్యాన విద్యార్థులకు పండ్లు, మోరంపూడి జంక్షన్‌లో పార్టీ నాయకులు చీరా రాజు, బొప్పన సుబ్బారావు ఆధ్వర్యాన వృద్ధులకు దుప్పట్లు, కడియపులంక దోసాలమ్మ కాలనీలో ఈలి గోపాలరావు ఆధ్వర్యాన వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

### కొవ్వూరులో భారీ రక్తదాన శిబిరం

వైఎస్సార్ జయంతి వేడుకలను కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యాన భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమని రమేష్‌బాబులు స్వయంగా రక్తదానం చేశారు. వీరితో పాటు 80 మంది రక్తదానం చేశారు. అనంతరం, భారీ కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులకు పంచారు. తాళ్లపూడి మండలం పెద్దేవం, అన్నదేవరపేటల్లో జరిగిన వేడుకల్లో పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తలారి వెంకట్రావు పాల్గొన్నారు. వృద్ధులు 50 మందికి చీరలు, లుంగీలు, విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పరిశీలకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గోపాలపురం

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ హోం మంత్రి తానేటి వనిత పాల్గొని, వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచారు. గోపాలపురంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

### రాజానగరం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అందించిన పాలన నిజంగా ఒక స్వర్ణయుగమేనని, అందువల్లనే ఆయన రూపొందించిన సంక్షేమ పథకాలు మరో 50 ఏళ్ల పాటు గుర్తుంచుకునే విధంగా అమలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యాన రాజానగరం మండలం దివాన్ చెరువులో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో వేణు పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం మనసున్న నాయకుడిగా అనేక పథకాలు అమలు చేసి, చరిత్రలో నిలిచిపోయిన మహనీయుడు వైఎస్సార్ అని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. కార్యక్రమంలో పార్టీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నిడదవోలు

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నిడదవోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు కేక్ కట్ చేసి, అందరికీ పంచారు.



రాజమహేంద్రవరం మోరంపూడి జంక్షన్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణు



గోపాలపురంలో పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ హోం మంత్రి, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనిత తదితరులు



రాజానగరం మండలం దివాన్ చెరువులో కేక్ కట్ చేస్తున్న చెల్లుబోయిన వేణు. చిత్రంలో జక్కంపూడి రాజా, విజయలక్ష్మి తదితరులు

# ఆ క్రెడిట్ కొట్టేద్దామని..

- 'ప్రసాద్'ను తన ఖాతాలో వేసుకునేందుకు ఎంపీ ప్రయాస
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ పథకం కోసం కృషి
- అప్పటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని పలుమార్లు కలసిన నాటి ఎంపీ గీత
- ఫలితంగా పచ్చజెండా ఊపిన కేంద్రం
- అప్పట్లోనే వర్చువల్‌గా శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- అయినప్పటికీ ఇదంతా తన కృషి వల్లనేనంటూ తంగెళ్ల ప్రచారం

### కూటమి ప్రభుత్వ ప్రమేయమే లేదు



"వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రసాద్ నిధుల విడుదల, పనుల ప్రారంభోత్సవం జరిగాయి. ఇందులో కూటమి ప్రభుత్వ ప్రమేయమేదీ లేదు. ప్రస్తుతం టెండర్లు మాత్రమే ఈ ప్రభుత్వ హయాంలో జరుగుతున్నాయి. సత్యదేవుని భక్తుల సౌకర్యార్థం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కేంద్రం ప్రసాద్ నిధులు రూ.20.06 కోట్లు మంజూరు చేసింది. వాస్తవానికి రూ.92 కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు అప్పట్లో ప్రతిపాదించాం. ప్రస్తుత ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మిగిలిన నిధులు సాధించి, అప్పుడు ప్రచారం చేసుకోవాలి."

– వంగా గీతా విశ్వనాథ్, కాకినాడ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి



ప్రసాద్ నిధుల కోసం గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలసిన నాటి ఎంపీ గీత తదితరులు

అన్నవరం: కష్టపడింది ఎవరైనా.. దానికి మంచి ఫలితం వస్తే చాలు.. ఏమాత్రం జంకూగొంకూ లేకుండా ఆ క్రెడిట్ కొట్టేయడానికి కూటమి పెద్దలు తెగ తాపత్రయపడుతూంటారు. ఆ విషయంలో కూటమిలోని జనసేన పార్టీకి చెందిన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్.. రెండాకులు ఎక్కువే చదివానని నిరూపించుకుంటున్నారనే విమర్శ వస్తోంది. అన్నవరం దేవస్థానంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం మంజూరు చేసిన 'ప్రసాద్' స్కీమును తన ఖాతాలో వేసుకునేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలే దీనికి కారణమవుతున్నాయి.

### ఏం జరిగిందంటే..

దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పిలిగ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీముకు అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం 2016లో ఎంపికైంది. అయితే, 2019 వరకూ ఉత్తరాది రాష్ట్రాల్లోని వారణాశి, మధుర తదితర పుణ్యక్షేత్రాల అభివృద్ధి పైనే కేంద్రం దృష్టి సారించింది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. కాకినాడ ఎంపీగా వంగా గీతా విశ్వనాథ్ ఎన్నికయ్యారు. రాష్ట్రాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో భాగంగా ప్రసాద్ స్కీము ద్వారా ఎక్కువ నిధులు సాధించి, అన్నవరం దేవస్థానంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని అప్పటి ఎంపీ వంగా గీతను నాటి సీఎం జగన్ ఆదేశించారు. అప్పటి నుంచీ ఆమె ఈ స్కీము నిధుల కోసం ఢిల్లీలోని కేంద్ర పర్యాటక శాఖ అధికారులతో పలు దఫాలు చర్చలు జరిపారు. అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి అన్నవరం దేవస్థానానికి అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు.

తొలుత అన్నవరం దేవస్థానానికి రూ.100 కోట్లు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని కేంద్రం చెప్పింది. ఆవిధంగా ప్రతిపాదించగా అందులో రూ.8 కోట్లు తగ్గించి, రూ.92 కోట్లకు పరిమితం చేసింది. చివరకు డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) వద్దకు వచ్చేసరికి రూ.54 కోట్లకు తగ్గించింది. చివరకు కేంద్రం రూ.20.06 కోట్లు మాత్రమే మంజూరు చేయడం కొంత అసంతృప్తికి కారణమైంది. ఒక దశలో రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తారనే సమాచారం రావడంతో నాటి ఎంపీ గీత.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలసి, ప్రసాద్ స్కీము నిధులు పెంచాలని కోరారు. ఆమె కృషితో కేంద్రం ఎట్టకేలకు రూ.20.06 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.11.09 కోట్లతో రెండంతస్తుల్లో అన్నదాన భవనం, రూ.5.9 కోట్లతో క్యూ కాంప్లెక్స్, రూ.61.78 లక్షలతో టాయిలెట్ బ్లాకులు, రూ.1.08 కోట్లతో వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్, రూ.91.96 లక్షలతో భక్తుల క్యూ కాంప్లెక్స్ ప్రహరీ నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రూ.కోటి వ్యయంతో 2 బ్యాటరీ కార్లు కూడా మంజూరు చేశారు. ఈ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి గత ఏడాది మార్చి 7న వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఆ కార్యక్రమంలో అప్పటి ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వంగా గీత, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, నాటి ఈఓ, ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ పాల్గొన్నారు. అనంతరం గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రసాద్ పనుల కోసం మూడుసార్లు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లు ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఇటీవల టూరిజం శాఖ సీఈ ఈశ్వరయ్య తదితరులు ప్రసాద్ స్కీము నిర్మాణాల స్థలాలను పరిశీలించి వెళ్లారు. త్వరలో టెండర్లు ఖరారు చేసి, ఈ నెలాఖరు నుంచి నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పారు.

### పనులు ప్రారంభమయ్యే సూచనలతో..

ప్రసాద్ స్కీము పనులు ఈ నెలాఖరున ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ రంగంలోకి దిగారు. ఈ మేరకు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు. ప్రసాద్‌తో పాటు అనేక విషయాల్లో అన్నవరం దేవస్థానం అభివృద్ధికి తాను కృషి చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై మాజీ ఎంపీ వంగా గీత అభ్యంతరం వ్యక్తం చేశారు. 2019–24 మధ్య అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కాకినాడ ఎంపీగా ఉన్న తాను ప్రసాద్ స్కీము కోసం మొక్కవోని పట్టుదలతో కృషి చేసి నిధులు సాధించానని గుర్తు చేశారు. అయితే, ఇదంతా ఆయన గొప్పే అన్నట్టు ప్రస్తుత ఎంపీ తంగెళ్ల ప్రచారం చేసుకోవడం దారుణమని విమర్శించారు.




ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పెట్టిన పోస్ట్

## క్లుప్తంగా

### 10 నుంచి పొగాకు విత్తనాల విక్రయం


డాక్టర్ మాగంటి శేషుమాధవ్, నిర్కా డైరెక్టర్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్-నిర్కా) (పూర్వపు సీటీఆర్‌ఐ)లో 2025-26 సీజన్‌కు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నాణ్యమైన వర్జీనియా పొగాకు విత్తనాలు విక్రయించనున్నారు. వీటిని ఎస్‌బీఎస్, ఎస్‌ఎల్‌ఎస్, ఎన్‌బీఎస్, ఎన్‌ఎల్‌ఎస్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మంగళవారం ప్రకటనలో కోరారు. అలాగే 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కందుకూరులోని వాణిజ్య వ్యవసాయ పరిశోధనాసంస్థ (పూర్వపు సీటీఆర్‌ఐ)లో కూడా పొగాకు విత్తనాల విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. జీబీఆర్‌ఎస్ పాస్‌బుక్ ఉన్న రైతులకు ప్రతి బ్యారన్‌కు 500 గ్రాముల చొప్పున కిలో రూ.1,300కు విక్రయిస్తారన్నారు. కావాల్సిన రైతులు బ్యారన్ రిజిస్ట్రేషన్ పాస్‌బుక్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. క్యాష్‌లెస్ లావాదేవీలు అనగా యూపీఐ (గూగుల్ పే, ఫోన్ పే ), క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా మాత్రమే అనుమతి ఉందన్నారు. పొగాకు బోర్డు ద్వారా రిజిస్టర్ చేయించిన కమర్షియల్ నారుమడులకు సంబంధించిన రైతులకు కిలో విత్తనాలను రూ.2,200కు విక్రయిస్తారన్నారు.

# రక్కసి కోత

- కరిగిపోతున్న ఉప్పాడ తీరం
- సముద్రంలో కలసిపోతున్న భూములు
- రక్షణ చర్యలు చేపట్టని ప్రభుత్వం
- నెరవేరని పవన్ కల్యాణ్ హామీ

**పిఠాపురం: ఉప్పాడ తీరంలో సముద్రం తరచూ ఉగ్రరూపం దాల్చుతుంటుంది. తుపాను రానప్ప**టికీ, ఉపద్రవాల హెచ్చరికలు లేనప్పటికీ సముద్ర కెరటాలు ఒక్కసారిగా ఉప్పొంగుతుంటాయి. దీంతో తీరం వెంబడి భూమి మీటర్ల మేర కోతకు గురవుతోంది. ఉప్పాడతో పాటు దాని శివారు గ్రామాలు కడలిలో కలిసి పోతుంటాయి. ఇలా సుమారు శతాబ్ద కాలంగా కడలి కబలించేస్తున్నా శాశ్వత రక్షణ చర్యలు మాత్రం కనిపించడం లేదు. ఇక్కడ ఉన్నవి గుడిసెలే కదా అని రూ.లక్షల్లో ఉన్న ప్రతిపాదనలను పట్టించుకోక పోవడం వల్ల వందల ఎకరాల పంట భూములు, పురాతన ఆలయాలు, భవంతులు కడలి గర్భంలో కలిసిపోయాయి. కాకినాడ - విశాఖ మధ్య పారిశ్రామికాభివృద్ధికి మూలస్తంభం లాంటి బీచ్ రోడ్డు నిర్మించిన నాటి నుంచే కడలి పాలవుతూనే ఉంది.

| గ్రామాలు | కోతకు గురైన భూమి (ఎకరాల్లో) |
|---|---|
| ఉప్పాడ | 84.51 |
| రమణక్కపేట | 13.01 |
| అమరవిల్లి | 133.50 |
| సుబ్బంపేట | 141.30 |
| కోనపాపపేట | 233.56 |
| మూలపేట | 359.78 |
| కొమరగిరి | 362.83 |
| మొత్తం | 1,360 |


ఉప్పాడ గ్రామంపైకి విరుచుకుపడుతున్న సముద్ర కెరటాలు


ఉప్పాడ తీరంలో పంట పొలాల్లోకి చొచ్చుకు వచ్చిన సముద్రం నీరు

**ఉప్పాడ రక్షణకు చర్యలు ఉత్తిమాటేనా?**

కోతకు గురవుతున్న ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు రూ.వందల కోట్లతో చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయం మరిచిపోయారు. గత ఏడాది ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన రక్షణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో తీర ప్రాంత రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో గత ఏడాది జూలై 24న కలెక్టర్ ఆధ్వర్యంలో డీఎఫ్‌ఓ భరణి, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ (ఎన్‌సీసీఆర్) జాయింట్ సెక్రటరీ రమణ మూర్తి జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉప్పాడ నుంచి కాకినాడ పోర్టు వరకు తీర ప్రాంతం అభివృద్ధి, ఉప్పాడ తీరం కోత, ఇతర ప్రాంతాల్లో సముద్ర కోత నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చలు జరిపారు. ఇవన్నీ జరిగి ఏడాది పూర్తవుతున్నా కనీసం ప్రణాళికలు కూడా తయారు కాలేదు.


ఉప్పాడ శివారు మాయాపట్నం వద్ద బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన జియో ట్యూబ్ రక్షణ గోడ (ఫైల్)


ప్రస్తుతం మాయాపట్నం వద్ద కడలిలో కలిసిపోయిన జియోట్యూబ్ రక్షణ గోడ

**పెరిగిన కోత**

గత కొన్ని నెలలుగా ఉప్పాడ తీర ప్రాంతం తీవ్ర కోతకు గురవుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేకుండా నిత్యం కోత బారిన పడుతోంది. ఇప్పటి వరకు రక్షణగా ఉన్న జియోట్యూబ్ టెక్నాలజీ రక్షణ గోడ పూర్తిగా కడలిలో కలిసి పోగా, పక్కనే ఉన్న పంట పొలాలు సైతం సముద్రంలో మునిగిపోతున్నాయి. ఇలా ఇప్పటి వరకు 1,360 ఎకరాల పంట భూమి కోతకు గురై కడలి గర్భంలో కలిసి పోయింది. ఈ తీర ప్రాంత రక్షణకు రూ.250 కోట్లతో ప్రణాళికలు అన్న మాట కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్‌సీసీఆర్ అధ్యయనం ప్రకారం కోస్తా తీరంలో ఉప్పాడ కొత్తపల్లి, సఖినేటిపల్లి మండలాలు ప్రమాద స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. 1956 నుంచి ఇప్పటి వరకు ఒక్క ఉప్పాడ గ్రామంలోనే సుమారు 85 ఎకరాల భూమి సముద్రంలో కలిసిపోయినట్లు గుర్తించారు.

**కోతకు కారణమేదే!**

గోదావరి ఇసుక కొట్టుకు రావడం వల్ల కాకినాడ సమీపంలో ఏర్పడిన హోప్ ఐలాండ్ కారణంగానే ఉప్పాడ ప్రాంతం కోతకు గురవుతుందని నిపుణులు తేల్చి చెప్పారు. ఈ ఐలాండ్ సముద్రంలో 40 చదరపు మైళ్ల విస్తీర్ణం గల లోతు లేని అగాధం (కాకినాడ బే) సృష్టించడం వల్ల దీని సమీపంలోని ఉప్పాడకు ముప్పు ఉందని నిర్ధారించారు. ఉత్తరం వైపు నుంచి తెరుచుకుని ఉండే ఈ అగాధం దక్షిణ వైపు నుంచి తీరానికి వెళ్లే అలలను అడ్డుకుంటోంది. దీంతో అలలతో పాటు వెళ్లే పదార్థాలు (లిట్టోకల్ డ్రిఫ్ట్) తీరం చేరడం లేదు. దానివల్ల అలల తాకిడితో హోప్ ఐలాండ్‌లో ఇసుక దిబ్బలు పెరుగుతుండగా, ఉప్పాడ తీరంలో ఇసుక మేటలు వేయడానికి బదులు తీరంలో మట్టి కోతకు గురవుతుంది.

**75 ఏళ్ల క్రితమే..**

1950లోనే ఉప్పాడ తీరానికి సముద్ర కోత వల్ల ముప్పు ఉందని అధికారులు గుర్తించారు. రక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఈ మేరకు సర్వే జరిపిన విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం తేల్చి చెప్పింది. 1971లో కోత తీవ్రతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 1992లో పూణేలోని అప్పటి పీడబ్ల్యూఆర్ఎస్ డైరెక్టర్ సీవీ గోలే అధ్యక్షతన ఒక సాంకేతిక సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ బృందం సాంకేతిక పరంగా సర్వేలు జరిపి ఉప్పాడ ప్రాంతం కోత.. విశేష స్వభావం కలిగినదిగా తెలిపింది.

**పొంచిఉన్న ప్రమాదం**

కాకినాడ - విశాఖ మధ్య పారిశ్రామికాభివృద్ధికి మూలస్తంభమైన ఉప్పాడ తీరం శాశ్వత రక్షణకు చర్యలు చేపట్టలేకపోతే, ప్రత్యామ్నాయం అయినా చూడాలి. ఉప్పాడ కోతకు అడ్డుకట్ట వేస్తానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ నెరవేరుతుందని ఆశించిన తీర ప్రాంత వాసులకు నిరాశ మిగిలింది. దీంతో గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందే అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర కోత కారణంగా ఇప్పటి వరకూ సుమారు 32 వేల నివాస గృహాలు కడలిలో కలసిపోయినట్టు లెక్కలు చెబుతున్నాయి.

### లైంగిక వేధింపులపై కేసు

**దేవరపల్లి:** నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన మర్రి శోభన్‌బాబుపై నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం లైంగిక వేధింపుల కేసు నమోదైంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నబీపేట గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో శోభన్‌బాబు ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. అతడి నుంచి విడిపించుకునే సమయంలో జరిగిన పెనుగులాటలో ఆ మహిళకు గాయాలయ్యాయి. దీంతో ఆమెను తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదుచేయగా శోభన్‌బాబుపై కేసు నమోదు చేశారు.

### ఆర్టీసీలో కారుణ్య నియామకాలు


కారుణ్య నియామక పత్రాలతో అభ్యర్థులు, చిత్రంలో ఆర్టీసీ అధికారులు

**రాజమహేంద్రవరం సిటీ:** ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తూ వివిధ సహజ మరణాలతో పాటు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల పత్రాలను అందజేసినట్లు డీపీటీఓ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పది మందిని కండక్టర్ గ్రేడ్-2 ఉద్యోగం కోసం ఎంపిక చేసి, నియామక పత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సేద్య పద్ధతులతో కోకోలో అధిక దిగుబడి


మాట్లాడుతున్న ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి ముత్యాల నాయుడు

**అంబాజీపేట:** కోకో సాగులో నూతన సేద్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అన్నారు. అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో డైరెక్టర్ ఆఫ్ క్యాష్‌వేనట్ అండ్ కోకో డెవలప్‌మెంట్ ప్రోత్సాహంతో మంగళవారం కోకో సాగుపై శిక్షణ నిర్వహించారు. ముత్యాల నాయుడు మాట్లాడుతూ కోకో తోటల్లో యాజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. కొమ్మ కత్తిరింపు, పురుగుల నియంత్రణ పద్ధతులపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకోను సాగు చేయడం వల్ల అదనపు రాబడి పొందవచ్చన్నారు. డాక్టర్ నామాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కోకో కాయ తయారయ్యే సమయంలో తోటలను రైతులు పరిశీలించి ఎలుకల బెడద ఉంటే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. హార్టికల్చర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కోకో ప్రొడక్షన్, కోకో వాల్యూ అడిషన్, ప్రోసెసింగ్ విధానాలను వివరించారు. శాస్త్రవేత్తలు బి.నీరజ, ఎ.కిరీటి, వి.అనూష తదితరులు కోకోలో సూక్ష్మపోషకాల యాజమాన్య విధానాలను తెలిపారు.

## వీరేశ్వరా.. క్షమించవా..

- అభిషేకానికి ఉపయోగించే కొబ్బరి కాయలు పక్కదారి
- మురమళ్ల ఆలయంలో ఘటన
- అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం

**ఐ.పోలవరం:** మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి కొబ్బరి కాయలతో అభిషేకం పూర్తిస్థాయిలో జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో కొబ్బరికాయలు పక్కదారి పడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఆలయంలో ప్రతి రోజూ రాత్రి జరిగే కల్యాణాలకు సంబంధించి ఉదయం అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ అభిషేకానికి సంబంధించి ఒక టిక్కెట్టుకు రెండు కొబ్బరి కాయలు కేటాయిస్తారు. పండితులు వీటితో భక్తుల గోత్రనామాలతో స్వామికి, వినాయకునికి అభిషేకాలు చేస్తారు. ప్రతి నిత్యం సుమారు 116 కల్యాణాలు ఇక్కడ జరుగుతాయి. అంటే రోజుకు 232 కొబ్బరికాయలు కొట్టాలి. కానీ ఆలయంలో 15 రోజులకు సంబంధించి కేవలం ఒక్క రోజు మాత్రమే స్వామికి అభిషేకాల కొబ్బరి కాయలు కొట్టారు. మిగిలిన రోజులు స్వామికి ఎగనామం పెట్టేశారు. అభిషేకాలకు సంబంధించిన కొబ్బరి కాయలు ఎక్కడకు వెళ్లాయో తెలియదు.


ఆలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కొబ్బరి కాయల తొట్టె


మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

**భక్తుల ఆవేదన**

స్వామివారి కల్యాణానికి రుసుము రూ.1,000 తీసుకుంటారు. భక్తుల నమ్మకాన్ని కొందరు అవినీతి పరులు సొమ్ము చేసుకొంటున్నారు. స్వామివారి అభిషేకానికి ఉపయోగించాల్సిన కొబ్బరి కాయలను పక్కదారి పట్టించి, వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారు. అనాదిగా వస్తున్న ఆచార, సంప్రదాయాలను, పూజాది కార్యక్రమాలు తుంగలోకి తొక్కేస్తున్నారు. కొబ్బరి ధర హెచ్చును సాకుగా చూపుతూ కొబ్బరి నీళ్ల అభిషేకానికి స్వస్తి పలికేశారు. దీనిపై ఆగ్రహించిన కొందరు భక్తులు నేరుగా ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కొబ్బరి కాయల పాటదారునికి షోకాజ్ నోటీసులు ఇస్తామని ఆయన తప్పించుకొనే ప్రయత్నం చేశారు. అయితే అభిషేకాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆలయ అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఆలయంలో ఎంతో పవిత్రంగా భావించే అన్నప్రసాదాలకు రుచి, శుచి కరువైయ్యిందనే భక్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై సహాయ కమిషనర్ వి.సత్యనారాయణను వివరణ కోరగా కొబ్బరి కాయలు ఇవ్వడం లేదని తన దృష్టికి వచ్చిందని, సంబంధిత పాటదారునికి నోటీసులు అందజేసి యథావిధిగా అభిషేకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.



### పశువైద్యాధికారి శ్రీనివాసు మృతి



**ఆలమూరు:** నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఏడీ నాన్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్, పినపళ్ల గ్రామీణ పశు వైద్యాధికారి ఈదల శ్రీనివాసు (61) మంగళవారం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ సమయంలో గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. గుమ్మిలేరు, చింతలూరు, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, పినపళ్ల గ్రామాల్లో ఆయన పశువైద్యాధికారిగా సేవలందించారు.

### ముగ్గురు అవినీతి అధికారులకు జైలు

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** ఈ ఏడాదిలో ఇప్పటివరకూ ముగ్గురు అవినీతి అధికారులను ఏసీబీ పట్టుకుందని ఆ శాఖ రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిశోర్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 24న పిఠాపురంలో రూ.20 వేలు లంచం అడిగిన కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.గుణశేఖర్, మార్చి 28న కాకినాడ రిజిస్ట్రార్ కె.ఆనందరావు, జూన్ 25న వీఆర్‌వో పరస శ్రీమన్నారాయణను అరెస్టు చేసి జైలుకి పంపామన్నారు. ఎవరైనా లంచం అడిగితే తనకు 94404 46160, రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ భాస్కర్ 94404 46161, కాకినాడ జిల్లా ఇన్‌స్పెక్టర్ డి.వాసు 83329 71041, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ 94404 46163లతో పాటు అవినీతి నిరోధకశాఖ రాజమహేంద్రవరం ల్యాండ్‌లైన్ నంబర్ 0883 2467833కు సమాచారం ఇవ్వాలన్నారు.

### ఇసుక లారీ కింద పడి వ్యక్తి మృతి

**ధవళేశ్వరం:** ఇసుక లారీ కింద పడి ధవళేశ్వరం మసీదు వీధి కొండ మెరక ప్రాంతానికి చెందిన పువ్వల లక్ష్మణ్ (39) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పువ్వల లక్ష్మణ్ పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో పని కోసం రాజమహేంద్రవరానికి మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. ధవళేశ్వరం క్వారీ బోర్డు ఎదురుగా ఆటోను తప్పించే ప్రయత్నంలో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనుక వచ్చిన ఇసుక లారీ.. లక్ష్మణ్ కుడి కాలి పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసును ధవళేశ్వరం సీఐ టి.గణేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### బంగారు, వెండి ఆభరణాల చోరీ

**ఆలమూరు:** కాంట్రాక్ట్ అధ్యాపకురాలి ఇంట్లో బంగారం వెండి వస్తువులను దొంగలు చోరీ చేశారు. పెదపళ్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవి. గ్రామానికి చెందిన నరసింహదేవర వెంకటదుర్గ అచ్యుత విశాలక్ష్మి పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఈనెల నాలుగున తన కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి వెళ్లారు. అనంతరం ఈ నెల ఏడున తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని సుమారు రూ.8 లక్షల విలువైన 11 కాసుల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై జి.నగేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

### 10 నుంచి బిక్కవోలు - అనపర్తి రైల్వే గేటు మూసివేత

**సామర్లకోట:** స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని బిక్కవోలు - అనపర్తి మధ్య ఉన్న 415 రైల్వే గేటు (605/9-11) ను ఈ నెల 10 నుంచి 13 వరకూ మూసివేయనున్నట్టు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామ సుబ్బారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటులోని ప్రధాన ట్రాక్ మరమ్మతుల కోసం ఈ గేటు మీదుగా రాకపోకలు నిలిపివేస్తున్నామన్నారు. ఈ మేరకు అనపర్తి తహసీల్దార్, పోలీసు అధికారి, అనపర్తి, లక్ష్మీనారాయణపురం, కాపవరం పంచాయతీ అధికారులకు, లారీ, ఆటో యూనియన్ అసోసియేషన్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఇటుగా రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

## ఎస్‌బీఐ ఏటీఎం దగ్ధం

- పక్కనే ఉన్న బైక్‌లు, కారు సైతం అగ్నికి ఆహుతి
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం


దగ్ధమైన ఏటీఎం మెషీన్

**యానాం:** పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎం కాలిపోయిన ఘటనలో సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. కొత్త బస్టాండ్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించాయి. అవి ఆ పక్కనే ఉన్న మల్లిపూడి శ్రీనివాసరావుకు చెందిన మోటార్ మెకానిక్ షాపునకు విస్తరించాయి. దీంతో అక్కడే రిపేర్‌కు వచ్చిన నాలుగు బైక్‌లు, ఒక కారు కాలిపోయాయి. పోలీస్ క్వార్టర్ ఆవరణలో ఇంటి వాకిలి తుడుస్తున్న ఓ మహిళ ఆ మంటలను చూసి అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జగడం మీరా సాహెబ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాద స్థలాన్ని సీఐ అడలరసన్, ఎస్‌హెచ్‌ఒ-2 కట్టా సుబ్బరాజు, ఏఎస్సై పంపన మూర్తి, ఎస్‌బీఐ అధికార్లు పరిశీలించారు. ఏటీఎంలో నగదు ఎంత ఉందనేది ఇంకా తెలియలేదు. మెకానిక్ షాపు యజమాని మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 లక్షల విలువైన బైక్‌లు, కారు కాలిపోయాయన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.


కాలిపోయిన బైక్‌లు


దగ్ధమైన కారు

## ఈవోలదే సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు

**బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ):** అన్ని ఆలయాలలో సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని, అవి పనిచేయకపోతే ఈవోలే పూర్తి బాధ్యత వహించాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని దేవదాయశాఖ ఆలయాలు, సత్రాల ఈవోలతో మంగళవారం కాకినాడలోని బాలా త్రిపుర సుందరి ఆలయ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. రమేష్ బాబు మాట్లాడుతూ ఆలయాల్లో దేవుడి వెండి, బంగారం ఆభరణాలకు బీమా చేయించాలన్నారు. ఆలయాలు, సంస్థలకు సంబంధించి భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతమైతే సంబంధిత ఈవోలు వెంటనే నోటీసులు ఇచ్చి, వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో జ్యుయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ విళ్ల పళ్లంరాజు, దేవదాయశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ దాసరి భారతి, జిల్లా దేవదాయశాఖాధికారులు కె.నాగేశ్వరరావు, ఈవీ సుబ్బారావు పాల్గొన్నారు.

## వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసు అధికారి


అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని పరిశీలిస్తున్న సీఐ సునీల్ కుమార్

**కాకినాడ క్రైం:** సాధారణ గస్తీలో భాగంగా కాకినాడలో భద్రతను పర్యవేక్షిస్తున్న కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ కుమార్ ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. సర్పవరంలోని విశాఖ డైయిరీ సమీపంలో మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటల సమయంలో ఒక వ్యక్తి రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆ సమయంలో వాహనాల రద్దీ లేకపోవడంతో అతడికి ఎలాంటి ప్రమాదం వాటిల్ల లేదు. గస్తీలో భాగంగా అటుగా వెళ్లిన సీఐ సునీల్ కుమార్ ఆ వ్యక్తిని చూశారు. వెంటనే మంచినీరు తాగించి, సపర్యలు చేసి కూర్చోబెట్టారు. నీరసంతో పడిపోయానని అతడు చెప్పడంతో పోలీసులు సురక్షిత ప్రాంతానికి చేర్చి, ఓఆర్ఎస్ ద్రావణాలు కొని ఇచ్చారు. కాగా.. రోడ్డుపై పడిఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడిన సునీల్ కుమార్‌ను ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ దేవానంద్ పాటిల్ అభినందించారు.

### కంటైనర్ డ్రైవర్ మృతి


కంటైనర్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ నాగార్జున

**దేవరపల్లి:** గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి బెంగళూరు వెళుతున్న కంటైనర్ ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో కేబిన్‌లో డ్రైవర్ నాగార్జున(35) ఇరుక్కుపోయాడు. తీవ్రగాయాలతో ఉన్న అతడిని హైవే అంబులెన్స్‌లో చికిత్స కోసం గోపాలపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు నిర్ధారించారు. కర్ణాటకలోని మరసానపల్లికి చెందిన డ్రైవర్ కుటుంబ సభ్యులు, బంధువులు రావాల్సి ఉన్నందున మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చారు. కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

### మహిళను బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

**రంగంపేట:** సోషల్ మీడియా ద్వారా మహిళను బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రంగంపేటకు చెందిన టేకుమూడి దుర్గకు తెలంగాణలోని జనగాం జిల్లా బచ్చన్నపేటకు చెందిన కొండా బాలకృష్ణతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో అతడు దుర్గతో పాటు ఆమె కుటుంబ సభ్యుల ఫోటోలను మార్ఫింగ్ చేసి, వాటితో దుర్గను బెదిరించారు. ఫోన్ పే ద్వారా తన ఖాతాలోకి డబ్బులు కూడా వేయించుకున్నాడు. అయినా ఇంకా కావాలని డిమాండ్ చేస్తుండడంతో దుర్గ గత నెలలో రంగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి మంగళవారం బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### ఆర్టీసీలో టెండర్లపై అవగాహన

**రాజమహేంద్రవరం సిటీ:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించిన 11 ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చే విధానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించామని డీపీటీఓ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. రాజమహేంద్రవరంలోని ట్రైనింగ్ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ టెండర్ల ముందస్తు అవగాహన సదస్సుకు 21 మంది ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు హాజరయ్యారన్నారు.